తల్లిప్రేమలో గొప్పతనాన్ని తెలియజేస్తూ తల్లి రుణం తీర్చుకోవడంలోని ఆనందాన్ని గరుత్మంతుని కథ ద్వారా వివరించడం ఈ పాఠం ముఖ్య ఉద్దేశం.

కద్రువ, వినతలకు పందెం ఏవిధంగా ఏర్పడింది, వినత దాస్యం చేయవలసి వచ్చిన పరిస్థితిని తెల్పుతూ పూర్వకథను (పూర్వ గాథాలహరి ద్వారా) తప్పనిసరిగా విద్యార్థులకు వివరించాలి.

పయోరుహానన, కాద్రవేయులు, వైనతేయులు, వంటి పదాలకు వ్యుత్పత్యర్థాన్ని వివరించి చెప్పాలి. అన్వయక్లేశం కలిగిన, దీర్ఘ సమాసాలున్న పద్యాలను ఒకటికి రెండుసార్లు భావానుగుణంగా పాడిస్తూ పాఠ్య వివరణ చేయాలి.

"ఆయత పక్షతుం............." పద్యంలోనూ, 'అమిత పరాక్రమంబు...' పద్యంలోనూ గరుత్మంతుని శక్తిని తెలియజేసే విశేషణాలను విద్యార్థులతో చెప్పించాలి. అతని వేగ తీవ్రవతను ( వితతోల్కా.....) ఆధారంగా వివరించాలి.

పాఠాన్ని విద్యార్థులు మాటిమాటికీ చదివి అవగాహన చేసుకునేందుకు అనువుగా అనేక ప్రశ్నలు మౌఖికంగానూ, వ్రాత రూపంలోనూ అడగడం ద్వారా పద్య పఠనంపై ఆసక్తిని పెంచవచ్చు. పద్య అవగాహనా సామర్థ్యాన్ని పెంచవచ్చు.

దీర్ఘ సమాస వాక్యాలకు భావం వ్రాయించడం, భావానుగుణమైన వాక్యాలను పద్యాల్లో అన్వేషించడం వంటి కృత్యాలు విద్యార్థుల అవగాహనకు ఎంతగానో ఉపకరిస్తాయి. పాఠం అనంతరం ఉండే "ఇవిచేయండి" కృత్యాలను విద్యార్థులతో తప్పనిసరిగా చేయించడం ఉపయోగకరం.

"సృజనాత్మకత" కృత్యంలో గరుడునికి, కద్రువ కుమారులకు మధ్య చర్చను విద్యార్థులతో చెప్పిస్తూ సంభాషణ వ్రాయించాలి. సంభాషణ ఏ విధంగా ప్రారంభమై, ఎలా సాగి, ఎలా ముగియాలో ఆలోచించే క్రమంలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు సహకరించాలి.

గరుడునికి గల "అమ్మప్రేమ"ను వివరిస్తూ సమకాలీన సమాజంలో తల్లిని నిర్లక్ష్యం చేసే వారు, దూషించేవారు ఉంటున్న స్థితిని వివరిస్తూ జన్మనిచ్చిన తల్లికి ఎలా సహకరించాలో, వారి కష్టాల్ని పోగొట్టడంలో ఎలాంటి పనులు చేయవచ్చో విద్యార్థులతో చెప్పించవచ్చు. స్వీయ రచన ప్రశ్నల్ని చర్చ ద్వారా సమాధానాలు రాబడుతూ వ్రాయించాలి.

పనిని, కష్టాల్ని సుఖాల్ని అందరితో కలిసి పంచుకునే ఇల్లు, ఆనందాల హరివిల్లు వంటిదని, పరస్పరం భావాల్ని, బాధ్యతల్ని పంచుకోవడం ఇంటిలోనే సాధ్యం అవుతుందని, ఇంటిలో ఎంతమంది సభ్యుల్ని (అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మామయ్య, పిన్ని వంటివారు) చేర్చుకోగలిగితే అంత ఆనందం ఉంటుందని తెలియజేయడం పాఠ్యభాగ ఉద్దేశం. ఈ ఉద్దేశానికనుగుణమైన బోధన, వ్యాఖ్యానం ఈ పాఠం ద్వారా చేయాలి. పిల్లలో సమూహ భావనను (సమిష్టి కుటుంబం) పెంచగలగాలి.

'ఆలోచించి చెప్పండి' లో రెండు బొమ్మల మధ్య వ్యత్యాస విశ్లేషణ చేయించడం ద్వారా పాఠ్య విషయంలోనికి సులభంగా వెళ్ళవచ్చు. ఆయా పేజీలలోని బొమ్మల్ని, కార్టూన్లను, చదివించి కూడా అవగాహన పెంపొందింపజేయవచ్చు.

సమిష్టి కుటుంబానికి, వ్యష్టి కుటుంబానికి తేడాలు వివరిస్తూ, భారతీయ కుటుంబ సాంప్రదాయాల్ని వివరించాలి.

'ఇంటికి దీపం ఇల్లాలు' ' అసలు కంటే వడ్డీ ముద్దు' వంటి సామెతల అర్థ వివరణచేస్తూ మొదటి సామెతలో ఇంటిపనిలో స్త్రీ ప్రాధాన్యతను, రెండోసామెతలో కుటుంబంలో ముసలివారి ముద్దు మురిపాలను వివరించవచ్చు. అలాగే ఆశ్రమ ధర్మాలలో గృహస్థాశ్రమ ధర్మ ప్రత్యేకతను వివరించాలి.

కీలకమైన వాక్యాల క్రింద గీత గీయించుతూ వాటి ప్రాధాన్యతను వివరించవచ్చు. కుటుంబం, వ్యష్టి కుటుంబం వంటి భావనల నిర్వచనాలను మరల మరల విచారణ చేయాలి.

సమిష్టి కుటుంబాలు లేకపోవడానికి కారణాలన్నీ విద్యార్థుల స్వీయ అనుభవాల్నుండి అన్వేషించేలా చేస్తూ వర్తమాన కాలంలో వ్యష్టి కుటుంబం అనివార్యతను కూడా గుర్తింపచేయాలి. అయితే వ్యష్టి కుటుంబంలో ఉన్నప్పటికీ సమిష్టి సంబంధాల అవసరాన్ని విద్యార్థులు గుర్తెరిగేలా చేయగలగాలి. కుటుంబమే లేకపోతే అలాంటి సమాజంలో మానవ సంబంధాలు ఎంత దుర్భరంగా ఉంటాయో అనాథ పిల్లల అనుభవాల్నుండి అలోచించేలా చేయవచ్చు.

"పిల్లల సమస్త సద్గుణాలకు, దుర్గుణాలకు ఇల్లే పునాది" ఈ వాక్యంలోని అర్థాన్ని సోదాహరణంగా వివరించవచ్చు. ఉత్తమ పౌరులు, ఉత్తమ కుటుంబ సంబంధాలనుండే తయారవుతారన్న సత్యాన్ని విద్యార్థులు గ్రహించేవిధంగా చేయవచ్చు. ఈ క్రమంలో తరగతిలోని విద్యార్థుల్ని ప్రత్యేక ఉదాహరణలుగా గ్రహించి వారిని నొప్పించకుండా జాగ్రత్తపడాలి.

"అతి సర్వత్ర వర్జయేత్" అతిగా వ్యవహరించడం ఏ విషయంలోనైనా ఉండకూడదు అని ఈ వాక్యార్థం. ఈ పాఠం కూడా ఇదే విషయాన్ని హాస్యం కలిగిస్తూ చెబుతుంది. కొత్తల్లుడికి అత్తగారు అతిగా వడ్డించరాదు. డాక్టరు ఫీజు అతిగా ఉండకూడదు. అల్లరి అతిగా ఉండరాదు మొ॥వి. సంభాషణను పాత్రకు అనుగుణంగా గొంతు మార్చి అర్థవంతంగా చదివితే విద్యార్థికి పాఠ్యాంశం సులభగ్రాహ్యమౌతుంది. మధ్యలో అవసరమైన చోట వివరణ ఇస్తుండాలి. ఉపాధ్యాయుడు చదివే విధానంలోనే హాస్యం కలిగించవచ్చు. విద్యార్థులతో ప్రదర్శించవచ్చు. విద్యార్థులను జట్టులుగా చేసి చదివించి వారిని ఇతర విద్యార్థులచే అభినందింపజేయండి. ఇంకా ఇలాంటి హాస్య నాటికలు విద్యార్థులతో ప్రదర్శింపచేస్తే బాగుంటుంది.

మకుట నియమం ఆధారంగా శతకాన్ని గుర్తించేలా చేయడం, శతక లక్షణాల్ని క్లుప్తంగా తెలియజేయడం, నీతులు (ముక్తకాలు) వివరించాలి.
ప్రతిపదార్థ వివరణలో సంబోధన, కర్త, కర్మ, క్రియ అనే ప్రధాన క్రమాన్ని పాటించడం, విశేషణలు కర్త, కర్మ క్రియలలో వేటికి వాడారో గుర్తింపజేయడం.

ఏ విషయాన్ని చెప్పడానికి దేనిని పోలికగా కవి గ్రహించాడో గమనించేలా విద్యార్థులకు అభ్యాసాన్ని కలిగించడం ఉపయోగకరం.
ఉదా:- పద్యంలో తనకు ఫలంబు.......లోకోపకారిని శేషునితో పోల్చడం, చదువది............పద్యంలో 'నా చదువు' అని కాకుండా "ఆ + చదువు నిరర్థకంబు" అని చదవకపోతే అర్థం మారుతుందని విద్యార్థులతో గుర్తింపజేయాలి.

పంచేంద్రియలోభం కంటే అరిషడ్వర్గానికి గురికావడం చాలా తీవ్రమైనది. కోలుకోవడం దుష్కరమైనది. మొదటిది ప్రధానంగా భౌతిక ఇంద్రియ పరమైనదైతే, రెండోది ఆత్మికమైనది. శరీర లోభత్వాన్ని కొంత సులువుగా తొలగించుకోవచ్చు కాని మానసికమైన అరిషడ్వర్గపు లోభం వదిలించుకోవడం చాలా కష్టం. ఈ రెండు రకాల బలహీనతలకు గురికాకుండా తమని తాము నియంత్రించుకోగలవాడే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా సాధించగలడని విద్యార్థులకు తెలియజేయాలి. దురవగాహనకు అవకాశమిచ్చే తాత్విక వ్యాఖ్యానం కాకుండా విద్యార్థుల నిజ జీవిత ఉదాహరణలతో సమన్వయించి వ్యాఖ్యానిస్తే ఆశించే ఫలితం సులభసాధ్యం. లేకుంటే దుష్కరం.

పద్యాన్ని చదివి అవగాహన చేసుకునే అవకాశం ముందుగా విద్యార్థికివ్వడం, మధ్యస్థ విద్యార్థులతో చదివించి సరిదిద్దడం, ఆ తర్వాత ఉపాధ్యాయుని ఆదర్శ ప్రకాశ పఠనం మంచి ఫలితాలనిస్తుంది. విశ్లేషణ చేసేటప్పుడు ప్రశ్నలడిగి జవాబులు రాబడుతూ అవగాహన తెలుసుకుంటూ సరిదిద్దే పద్ధతి విస్మరించరాదు. చివరగా పలుమార్లు పద్యాన్ని వల్లెవేయడం కూడా విద్యార్థికి పద్యం కంఠస్థం, మనస్థం కావడానికి దోహదపడుతుంది.

మనదేశ గతాన్ని, సంస్కృతిని తెలియజేసే కట్టడాలు, కళారూపాలపట్ల అభిరుచి కలిగించడం, వాటిని సంరక్షించుకోవాలనే స్పృహను విద్యార్థులలో పెంపొందింపజేయడం పాఠం ముఖ్య ఉద్దేశం.

విద్యార్థులు స్వయంగా చదివి, కీలక వాక్యాల క్రింద గీతలు గీయడం వంటి పనులు చేయించాలి. 'దృశ్యాన్ని చూడడం, అనుభూతిలో జీవించడం' అనే వాక్యంలో ఇమిడిన భావాన్ని చూడడానికి సంబంధించిన నేర్పును గుర్తింపజేయడం.

అజంతా గుహలు మహారాష్ట్రలో "తపతి నదికి ఉపనదియైన వాఘోరా నది పుట్టే చోట కొండలలో" ఉన్నాయనే విషయం తెల్పడం, గుహలలో చిత్రాలు ఏకకాలంలో ఎలా చిత్రించారో తెలిపి ఆ చిత్రాలు పాడైపోవడానికి కారణాలు తెలపడం, మేజర్‌గిల్ గుహలోని చిత్రాలను కనిపెట్టిన తీరు, వాటిని కాపాడడానికి ప్రయత్నించిన తీరూ తెలియజేయడం.

"వ్యూ పాయింట్" అంటే ఏమిటి? అది అజంతాలో ఎక్కడ ఉందో తెల్పడం. గుహలలో చిత్రాలు ప్రధానంగా బౌద్ధమత జాతక కథలని (బుద్ధుని పూర్వజన్మ వృత్తాంతాలు) తెల్పడం. అజంతా చిత్రాలు ప్రపంచ చిత్రకళా చరిత్రలో విశిష్టమైనవని చెప్పడం. ముఖ్యంగా బుద్ధుని అర్ధనిమీలిత నేత్రాల వెనుక జీవిత విషాదాన్ని దాచినట్లుగా చిత్రించిన కళాకారుల చిత్రణ తీరు గొప్పది. అలాగే స్త్రీమూర్తుల సౌందర్యం, వారి వస్త్రధారణ, ఆభరణాల తీరు, అలంకరణ రీతి, క్రీ॥శ. మొదటి సహస్రాబ్దపు రాజకాంతల నృత్య, సంగీతకారిణుల పద్ధతులను తెలియజేస్తున్నాయన్న విషయం స్పష్టపరచడం.

పాఠం ముగిసేటప్పటికి విద్యార్థులకు అజంతా గుహలను దర్శించాలని, బుద్ధుని కథలు, కారుణ్యం గురించి తెలుసుకోవాలని ఆసక్తి కలగాలి. పాఠంలోని బొమ్మల్ని సూక్ష్మ పరిశీలన చేయించడం ద్వారా కూడా పాఠ్య విషయాలపై ఆసక్తి బలపరచవచ్చు.

నార్ల వెంకటేశ్వరరావుగారి యాత్రా కథనాన్ని చదివిన ప్రేరణతో విద్యార్థులు వారు చూసి, అనుభూతి చెందిన యాత్రా స్థలాన్ని గురించి కథనం వ్రాసేలాగా ప్రోత్సహించవచ్చు.

దృశ్యాన్ని అనుభూతి చెందడం ఎలా ఉంటుందో దాని వర్ణన ఎలా ఉంటుందో పాఠంలో వెంకటేశ్వరరావుగారు అజంతా గుహల నైసర్గిక వర్ణన చేసిన తీరు ఆధారంగా వివరించడం.

అమాయకులైన పరమానందయ్య శిష్యుల చేష్టలు, ఆలోచనలు మనకు వినోదం కలిగిస్తాయి. పాఠ్య బోధనలో ఉపాధ్యాయుడు పాత్రల సంభాషణకు అనుగుణంగా గొంతు మార్చుతూ భావానుగుణంగా చదివి, విన్పించి, అవగాహన కల్పించవచ్చు. అనంతరం విద్యార్థులతో నాటిక రూపంలో ప్రదర్శించవచ్చు. విద్యార్థులు ఆసక్తికరంగా చదువుకునే విధంగా పాఠ్యబోధన ఉత్సాహకరంగా ఉండాలి. అమాయకులైన శిష్యులు 'తెలివిగా' ఆలోచిస్తున్నామనుకొని తెలివితక్కువగా ఎలా అలోచిస్తారో "గుర్రం గుడ్డు" కథ చక్కగా తెలియజేస్తుంది. విద్యార్థులకు సమయస్ఫూర్తిగా వ్యవహరించడం తెలియజేయాలి.

మనుషులు చేసే అనేకరకాల శ్రమలలో నేరుగా ప్రజల మౌలికావసరాలను తీర్చే రైతు, కార్మికుడు, వృత్తికారులు చేసే శ్రమ చాలా విలువైనదని గుర్తింపజేయడం, శ్రమచేస్తూ జీవించడంలోనే అసలైన సౌందర్యం ఉందని తెలియజేయడం పాఠ్యభాగ ఉద్దేశం.

కర్షక వీరుల కాయం నిండా కాలువకట్టే ఘర్మజలానికి (శ్రమకు) ఖరీదు కట్టలేమంటున్నాడు. ఎందుకంటే అది ధర్మజలం (మోసంతో కూడిన శ్రమ కాదు). జగానికంతా సౌఖ్యం నిండాలని రైతు తన బలాన్ని ధరిత్రికి బలికావిస్తూ విరామమెరుగక, నిరంతరం పరిశ్రమిస్తున్నాడు. అయినా అతడి కష్టాలుతీరడం లేదు. తను మోసపోతున్నా, కష్టజీవిగానే మిగులుతున్నా నిరంతరం శ్రమించే జీవి కనుకనే రైతు శ్రమ గొప్పది. అలాగే ప్రపంచ భాగ్యం వర్ధిల్లడం కోసం గనిలో, పనిలో, వనిలో, కార్ఖానాలో ధనిక స్వామికి దాస్యం వంటి సేవ యంత్రాల దగ్గర కార్మికుడు చేస్తున్నాడు. అతని శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. కష్టాలు తీరడం లేదు. అందుకే అతని కన్నుల్లో కోపం అనే అగ్ని కురుస్తుంది. ఆ కన్నుల్లో విషాదాశ్రువులు నిలుస్తున్నాయి. ఆ కోపానికి, బాధకు వెలకట్టలేమంటున్నాడు కవి. అంటే అది ధర్మాగ్రహమని, ఆ బాధని పరిశీలనగా, సానుభూతితో అర్థం చేసుకోవాలని కవి ఉద్దేశం. మూడో విషయంగా తనలో కదిలే నవ్యకవిత్వపు స్వభావం ఎలాంటిదో చెప్తున్నాడు. అది దారిద్ర్యాన్ని, దౌర్జన్యాల్ని తొలగించే వైపుగా ఆలోచనలనిస్తుంది. అసలైన శ్రమచేసే నిజమైన శ్రామికుల మేలుకు (కళ్యాణానికి) ఉపయోగపడుతుంది. శ్రమిస్తూ జీవించడంలోనే అసలైన సౌందర్యం ఉందని, శ్రమ గొప్పతనాన్ని చెబుతుంది. కవిత్వం వ్రాయడానికి తాను పురాణ కథల్నిగాని, అలౌకిక విషయాల్ని గానీ కాక శ్రమజీవుల జీవితాల్నే వస్తువులుగా గ్రహిస్తాని, కవిత చివర ప్రతీకల ద్వారా కవి చెప్తున్నాడు. (కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం......)

ఆధునిక కాలంలో కవిత్వం పూర్తిగా మారిపోయింది. వర్తమాన సందర్భాన్నీ, కంటికెదురుగా కన్పించే దుర్మార్గాన్నీ, మోసాన్నీ, కష్టాల్ని తప్పక పట్టించుకోవాలని కొందరు కవులు నిర్ణయంచేసుకున్నారు. ఈ ఆలోచనల స్వభావాల్ని తెలియజేసే "లండన్ రచయితల మేనిఫెస్టో" అనే రచనని చదవమని ఇచ్చారు అబ్బూరి రామకృష్ణారావనే ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి శ్రీశ్రీకి. దాన్ని చదివిన ఉద్వేగంలో శ్రీశ్రీ ప్రతిజ్ఞ అనే ఈ కవిత వ్రాశాడు. "లండన్ రచయితల మేనిఫెస్టో నీ కవితలో(ప్రతిజ్ఞ) దించేశావోయ్" అన్నాడట రామకృష్ణారావు శ్రీశ్రీతో. ఇది ఆ కవిత పుట్టుక నేపథ్యం.

కవితలోని శ్రవణ మాధుర్యాన్ని విద్యార్థులు ఆనందించేలా చేయాలి. ప్రధాన విషయాన్ని వర్ణించడానికి కవి వాడిన విశేషణాలను, పోలికలను, ప్రతీకలను లోతుగా విశ్లేషణ చేస్తూ లోదాగిన విషయాల్ని వివరించాలి. పాఠ్యం పూర్తయ్యేప్పటికి విద్యార్థులకు శ్రమపట్ల, శ్రామికుల పట్ల గౌరవం ఏర్పడాలి. వచనంలా కనిపించేదానిలో లోతైన అర్థం ఇమిడి ఉండడాన్ని గుర్తించాలి. డాబుని బట్టి కాకుండా వ్యక్తుల శ్రమని, సంస్కారాన్ని బట్టి మనుషుల్ని అంచనావేసే, గౌరవించే నేర్పు విద్యార్థులకు తెలియాలి.

మనుషులు, అలాగే ఇతర జీవులు తమచుట్టూ ఉన్న ప్రకృతిని చూసి ఎలా స్పందిస్తాయో, దాన్నుంచి జ్ఞానాన్ని పొందే క్రమం ఎలా ఉంటుందో, కుటుంబరావుగారు చిన్న పిల్లలకు తెలిసే విధంగా ఈ వైజ్ఞానిక వ్యాసం వ్రాశారు.

మనిషి తన జ్ఞానేంద్రియాల ద్వారా ప్రకృతి రహస్యాల్ని అన్వేషిస్తూ జ్ఞానాన్ని పొందుతాడు. ప్రకృతి నియమాల 'జ్ఞానాన్ని' పొందుతాడు. అయితే జ్ఞానేంద్రియాలకు పరిమితులున్నాయి. ఆ పరిమితిని మించిపోయే క్రమంలోనే టెలిస్కోపు, మైక్రోస్కోపు, ఎక్స్‌రే వంటి పరికరాల్ని తయారు చేసుకున్నాడు. ఇవి జ్ఞాన విస్తరణకు ఉపకరించాయి. పరికరాలే కాకుండా, అవగాహనలనుంచి తెల్సుకున్న జ్ఞాన నియమాలు కూడా మనిషి కున్నాయి. ఆ నియమాల్ని కూడా ఛేదించి కొత్త జ్ఞానం పొందడం ఉంటుంది. (పాఠంలో ఉదా:- లోహాలు, పాదరసం గురించి)

కొన్ని జంతువులకు మనుషులకు లేని గ్రహశక్తి ఉంటుంది. డాల్ఫిన్, గబ్బిలం, పాము వంటివి ప్రకృతి ఉత్పాతాల్ని మనిషి కంటే వేగంగా గుర్తిస్తాయి. ఇలా జ్ఞానాన్ని పొందే విధానం ఏయే విధాలుగా ఉంటుందో కొడవటిగంటి కుటుంబరావు గారు చాలా సరళంగా తెలిపారు.

పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయుడు స్పష్టంగా అవగాహన చేసుకుంటేనే విద్యార్థికి పాఠ్య విషయం స్పష్టం చేయగలడు. పరిశీలన-అనుభవం-అనుభూతి ... ఈ పదాల మధ్య తేడా, వీటిద్వారా జ్ఞానం ఎలా పొందుతామో తెలియజేయాలి.
కీలక వాక్యాల్ని గుర్తింపజేస్తూ వాటిని లోతుగా అర్థం చేసుకునే విధం నేర్పాలి.
పరిశీలన, అనుభవం, నియమములు వంటి వాటి ద్వారా శాస్త్రజ్ఞానం పొందడం, శాస్త్ర ప్రతిపాదనలు చేయడం.
-శాస్త్ర దృష్టి లాగే కళాదృష్టీ, కళా దృష్టిలాగే శాస్త్ర దృష్టీ మానవుడికి ప్రతిచోట అవసరపడుతుంది

కొన్ని కీలకపదాలు :- జ్ఞానేంద్రియాలు, ప్రకృతి రహస్యాలు, శాస్త్ర విజ్ఞానం, ప్రతిపాదన.. వీటిగురించి
ఇకోలొకేషన్ శక్తి:- గబ్బిలం, తిమింగలం వంటి కొన్ని జంతువులు, అవి ప్రయాణించే దారిలో శబ్దం చేస్తూ, శబ్ద ప్రతిఫలన దూరాన్ని బట్టి అవతల ఉన్న వస్తువును అంచనా వేయగలవు. ఇలాంటి శక్తినే ఇకోలొకేషన్ పవర్ అంటారు. రచయిత సైన్సు వ్యాసాలు సైన్సును సరళంగా పరిచయం చేస్తాయి. వీటి గురించి చెప్పి విద్యార్థుల్ని ప్రేరేపించవచ్చు.

రాజదర్బారుల్లో పాలకుల దర్పం, వారి గర్వాతిశయం, అత్తరు అమ్మే సాయిబు దివాంజీని ప్రసన్నం చేసుకునేందుకు చెప్పే లౌక్యపు మాటలు...కథలో ప్రధానంగా పాత్రల స్వభావ పరిశీలన ముఖ్యమైంది. కథ దీర్ఘంగా ఉన్నట్లనిపించినా పాత్ర స్వభావ విశ్లేష, పరిస్థితుల వివరాలివ్వడం చేస్తే బావుంటుంది.సంస్థానాలు, జమిందారులూ, వారి అతిశయపు పోకడలు అలాంటి పరిస్థితుల్లో వారి ప్రాపుకోసం పాకులాడి డబ్బు గడించాలనుకునే వ్యక్తుల కష్టాలు కథ ద్వారా గ్రహించవచ్చు. అత్తరు అమ్మే వ్యక్తి మానసిక సంఘర్షణ ద్వారా ఇతరులెవరైనా మనలను అవమానించే పరిస్థితి తలెత్తినప్పుడు ఎలా మెలగాలో విద్యార్థులకు వివరించాలి. నాటి పరిస్థితులే కాక నేటి సమాజంలోని మానవ స్వభావాన్ని అనుసరించాల్సిన విధానాన్ని వివరించాలి.

సత్యనిష్ఠగల హరిశ్చంద్రుని కథను, అతని గుణగణాలను తెలియజేయడం, విద్యార్థులు నిజం మాట్లాడడం అనే మంచి గుణాన్ని అలవరచుకునే లాగా చేయడం, ఈ పాఠం ఉద్దేశం

ప్రాచీన కవిత్వంలో రాజుల్ని వర్ణించే తీరు ఎలా ఉంటుందో పరిచయం చేయడం, ద్విపద ఛందో విధానాన్ని పరిచయం చేయడం, విద్యార్థులకు అవగాహన కల్పించాలి. షోడశ మహాదానాలను తెలియజేసి పూర్వకాలంలో వాటి ప్రాధాన్యతను గుర్తింపజేయాలి.

"సర్వశాస్త్రార్థకోవిదుడు" సర్వ శాస్త్రాలు అంటే గతంలో ఏవేవి? నేటి శాస్త్రాలకు, ఆ కాలపు శాస్త్రాలకు తేడా క్లుప్తంగా చెప్పడం.

నిరుపమ = ఉపమింపరాని (పోలిక చెప్పడానికి వీలుకాని)

ధనుర్వేద విద్య = బాణవిద్య. పూర్వకాలపు ఆయుధాలలో బాణాల ప్రాధాన్యత షట్చక్రవర్తుల్ని గుర్తించి క్లుప్తంగా చెప్పి, వారందరిలో మొదటిగా ఎన్నదగిన వ్యక్తిగా హరిశ్చంద్రుని ప్రాధాన్యత.

రెండువేల జిహ్వలు గలవాడు = (ఆదిశేషువు) సాధారణంగా ఒక వ్యక్తి గుణాలను ఒక వ్యక్తి తన నాలుకతో పొగడవచ్చు. కానీ రెండువేల నోళ్ళు గల ఆదిశేషువు హరిశ్చంద్రుని కీర్తించినప్పటికీ ఇంకా కీర్తించివలసిన గుణాలు అతనికి ఉన్నాయని తెల్పడం.

బ్రహ్మరాత మన నుదుటిపై రాయబడి ఉంటుందని దాన్ని మార్చడం సాధ్యం కాదని భావన (వారిజ గర్భుని వ్రాత)

వారిజాప్తుడు (సూర్యుడు) తూర్పున క్రుంగడం అసాధ్యం. ఎందుకంటే సూర్యుడు తూర్పున ఉదయించి పడమరన అస్తమించడమే సాంప్రదాయం. అలాగే మేరు పర్వతం కుంగడం, ఆకాశం వాలిపోవడం, భూమండలం తలక్రిందులవడం, సముద్రాలు ఇంకిపోవడం, వజ్రాయుధం పదును తప్పడం వంటివి అసాధ్యమైన/జరగని పనులు. ఒకవేళ అలాంటివి జరిగినప్పటికీ హరిశ్చంద్రుడు మాట తప్పడని భావం.

హరిశ్చంద్రుడి గుణాల్ని తెలిపే వర్ణన వాక్యాలు వ్రాయించాలి.

"గజల్ " అనే సాహిత్య ప్రక్రియను ఈ పాఠం ద్వారా విద్యార్థులకు పరిచయం చేయవచ్చు.
గజల్ లోని వర్ణనా విశేషాల ద్వారా, పోలికల ద్వారా జీవితానికి వర్ణనలకూ అన్వయం వెతుక్కునే విధంగా విద్యార్థుల దృష్టి మేల్కొల్పాలి.

సినారె గేయాల్లో సమరూప పదాల నిర్మాణం గురించి అవగాహన కలిగిస్తూ, భావావేశానికి అనుగుణమైన తూగుతో గజల్‌ను ఎలా చదవాలో విద్యార్థులకు నేర్పడం గజల్‌లోని మార్మికతను, తాత్వికతను అర్థం చేసుకునేందుకు అనుగుణంగా పాఠంలోని బొమ్మల్ని విశ్లేషించి చూపవచ్చు. జీవితం పట్ల తాత్విక దృష్టి అంకురింపచేయవచ్చు.

విద్యార్థులు గజల్స్‌పై ఆసక్తి పెంచుకునేలా, స్వయంగా గజల్స్‌ను వ్రాయడానికి ప్రయత్నించేలాగా ప్రోత్సహించవచ్చు.

ఉపాధ్యాయుడి వ్యాఖ్యానం ఎక్కువగా అవసరమయ్యే విధంగా ఈ గజల్స్ ఉన్నాయి. తగు విధంగా వ్యాఖ్యానించకపోతే విద్యార్థి గజల్‌ను అర్థం చేసుకోలేడు. మబ్బుకు మనసు కరగడం, మనసుకు మబ్బు ముసరడం ... ఈ రెండు వర్ణనల్లో మనసుకు మబ్బంటే ఏమిటో మబ్బుకు మనసంటే ఏమిటో  వివరించాలి. క్రియ పదాల, సమరూప పదాల వాడుకలో కవి చాతుర్యాన్ని చూపించగలగాలి. అప్పుడు మాత్రమే విద్యార్థి కవిత్వ భాషకున్న అద్భుత శక్తిని గ్రహించగలడు. వర్ణనలోని లోతును వీక్షించగలుగుతాడు.

పరోపకార పరాయణత్వం, నిరాడంబర జీవనం, అన్యోన్య దాంపత్యం ఈ గుణాలకు పుట్టన్న దంపతులు చక్కని ఉదాహరణగా నిలుస్తారు. నవ దంపతుల కోసం తన చేత్తో తాను నూతన వస్త్రాలు నేసి ఇవ్వడం పుట్టన్న పెట్టుకున్న నియమం.కటిక దారిద్ర్యంలో కూడా నియమం తప్పకపోవడం అతని ఆదర్శం. పుట్టన్న దంపతుల ఆదర్శాన్ని అద్భుతంగా అర్థం చేసుకోవడమేగాక అతనికి అండగా నిలిచిన వ్యక్తి పాపయ్య అల్లుడు. కథ అంతటా మంచి లక్షణాలు తొణికిసలాడుతాయి. పాపయ్య అల్లుడి మంచితనం ఇందుకు జోడి అవుతుంది.కథలో 'తర్వాత ఏం జరిగింది' అనే ఉత్సాహంతో కాకుండా పాత్రల మంచితనం, స్వభావం అర్థం చేసుకుంటూ వెళితే కథ గొప్పతనం మనకు, మన విద్యార్థులకు బాగా అనుభూతం అవుతుంది. కథ చదివే విధానం కూడా కీలకమైన విషయమే. పాలు అమ్ముకునే అలవాటు లేని రోజుల్లో పసి పిల్లలకు, పేదవారికి పాలను ఉచితంగా ఇచ్చేవారు. పాఠం ద్వారా ఇలాంటి మంచి సంప్రదాయాలు, అచారాలను విద్యార్థులకు తెలిపి వారిని ప్రోత్సహించవచ్చు..

మనదేశ గొప్పతనాన్ని విద్యార్థులు గ్రహించి, దేశాభిమానాన్ని పెంపొందించుకునేలాగా చేయడం, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలియజెప్పడం ఈ పాఠం ద్వారా సాధించాలి. శాంతి తత్వాన్ని , అహింసా మార్గాన్ని విద్యార్థులు తెలుసుకొని అనుసరించేలా చేయడం.

“పరమతపోనివేశనము” అన్నప్పుడు ఆ దేశ సంస్కృతి కీర్తించే మహర్షుల్ని గురించి తెలియజేయాలి. బుద్ధుడు, గాంధీజీ వంటి గొప్పవారు ‘ శాంతి చంద్రికల్ని’ ఎలా వెదజల్లారో తెలియజేయాలి.

‘ఇదినాదేశం’ అనే పద్యంలో “హిందూకుమారాగ్రణీ” అంటే “భారత కుమార శ్రేష్ఠుడా” అనే సాధారణ అర్థాన్ని గ్రహించాలి తప్ప మత భావాన్ని వివరించరాదు.
‘ ఈ గంగానది’ అనే పద్యంలో గంగ, గోదావరి, బ్రహ్మపుత్ర వంటి నదులు ఈ దేశ సౌభాగ్యాన్ని ఎంతగా పెంచాయో భౌగోళిక అభివృద్ధి క్రమాన్ని రేఖామాత్రంగా చూపుతూ వివరించవచ్చు.
బాపూజీ పలికిన ఉన్నత భావాలకు ప్రపంచమే కీర్తించింది. అలాంటి గొప్పవ్యక్తి ఉదాత్త భావనల్ని మనం నిర్లక్ష్యం, మలినం చేస్తున్న విషయం వివరించాలి.

పద్యాల్ని ఉపాధ్యాయుడు ఆదర్శ పఠనం చేయడం ద్వారానే విద్యార్థులు పద్యాల్ని చదివే విధానం తెల్సుకుంటారు. పద్యభావాల్ని గ్రహిస్తారు. కీలక భావనల్ని, అస్పష్ట లేదా మార్మిక భావనల్ని పలుమార్లు చెప్పించడం ద్వారా స్పష్టపరచాలి.

దేశాభిమానాన్ని పెంచే క్రమంలో పరదేశ ద్వేషాన్ని పెంచరాదు. మతాభిమానాన్ని పెంచడంలో పరమత దురభిమానాన్ని పెంచరాదు.
దేశభక్తి మార్మిక విషయం కాదు. దేశం పట్ల మన బాధ్యత.

ఈ పాఠం ద్వారా వార్తా పత్రికలలోని సంపాదకీయ వ్యాఖ్య ప్రత్యేకతను విద్యార్థులతో గుర్తింపజేయడం, పత్రికలలో సంపాదకీయ వ్యాఖ్యలు తప్పక చదివేలాగా విద్యార్థులను ప్రోత్సహించడం కూడా చేయవచ్చు. అలాగే స్వాతంత్రోద్యమంతో పాటుగా మనదేశంలో సంస్కరోణద్యమం జరిగిన తీరు, దాని చారిత్రక నేపధ్యం క్లుప్తంగా తెలియజేస్తూ సంస్కరణలు మొదటగా స్త్రీ జీవన సమస్యల్ని గుర్తించి పరిష్కార మార్గాల్ని చూపిన తీరును తెలియజెప్పవచ్చు. తగుమేరకు చారిత్రక నేపథ్యాన్ని వివరించకుండా సంస్కరణను తెలియజేయడం కష్టం. పరాయి పాలనలో అవిద్య కారణంగా, అజ్ఞానం కారణంగా, మూఢాచారుల విశ్వాసాల కారణంగా స్త్రీల జీవితాలు ఎలా కష్టాలపాలయ్యాయో విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అప్పుడే సంస్కరణ అవసరాన్ని, సంస్కర్తల కృషిలోని గొప్పతనాన్ని విద్యార్థులు గుర్తిస్తారు.

ప్రకృతి పరిణామాలకు అనుగుణంగా జీవులు స్పందించే తీరు ఉంటుంది. సమయం, వాతావరణంలో మార్పులు మొ॥న వాటిపై ఆధారపడి ఈ మార్పులు జరుగుతుంటాయి. ప్రకృతి పరిశీలనను విద్యార్థికి నేర్పాలి, పరిణామాలకు అనుగుణంగా జీవులు స్పందించే విధానం మనకు ఆసక్తి గొలుపుతుంది. పాఠ్య వివరణలో శాస్త్ర పరిభాషకు చెందిన పదాల్ని మరల మరల చెప్పించాలి.

పాఠ్య విషయాన్ని స్పష్టంగా విద్యార్థికి అవగాహన అయ్యేట్లు, ఆసక్తికరంగా బోధించడానికి రోజువారీ జీవిత ఉదాహరణలు ఇస్తూ ఉండాలి.

స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా జరిగిన అనేక ఉద్యమాల్లో భూదాన ఉద్యమం విశేషమైంది. వినోబాభావే గాంధీ తరహా అహింసా విధానంలో పెద్దరైతుల దగ్గర భూమిని పేదలకు పంచారు. అంతటి గొప్పపనిని సాధించడం వెనుక అతడి నిష్ఠని, ఆలోచనా రీతిని, దాతృగుణప్రేరణ తీరును, పరిచయం చేయడం ఈ పాఠంలోని ప్రధాన విషయం.

కాలినడక ద్వారా ప్రజలకు చేరువకావడానికి వారి సమస్యల్ని తెలుసుకోవడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్న విషయం ఈనాటి రాజకీయ నాయకులకు కూడా బాగా తెలుసు. అందుకే ప్రజలతో మమేకం కావాలనుకున్నవారు (బుద్ధుడి నుండి వినోభా వరకు- ఇప్పటి నాయకులదాకా) కాలినడకను ఎంచుకున్న విషయం చెప్పవచ్చు. కాలినడక ద్వారానే వినోబా దళితులకు భూదానం అనే అంశాన్ని స్పష్టంగా గ్రహించారు. అందుకే 'పాదయాత్ర' ను గురించి విద్యార్థులకు వివరించాలి.

అహింసా విధానంలో ఏ సమస్యనైనా తప్పక పరిష్కరించవచ్చు.అందుకు హృదయ శుద్ధి అవసరం. ఇలాంటి వాక్యాలను వివరించేటప్పుడు సమాజ సమస్యల్ని పలువురు నాయకులు గుర్తించే విధంలో, పరిష్కరించే విధంలో తేడాలు తెలియజేయాలి. 'హృదయశుద్ధి' అంతే నిజాయితీతో సమస్య గురించి ఆలోచిస్తూ పరిష్కారానికి ప్రయత్నించడం. ఏ పనికైనా హృదయ శుద్ధి ముఖ్యం. పాఠంలో ఇలాంటి పదాలున్నచోట అవి బాలలకు అర్థమయ్యేలాగా వివరిస్తూ వినోబాభావే వ్యక్తిత్వాన్ని గాంధీలాంటి గొప్ప వ్యక్తుల వ్యక్తిత్వంతో సరిపోల్చవచ్చు. 'అహింస' అలాంటి మరొక పదం.

దాతకు దానగ్రహీత పట్ల ఎలాంటి వైఖరి ఉండాలో, దాన సందర్భంలో దాత ఎంత నిరాడంబరంగా ఆలోచించాలో వినోబా వివరించారు. వినోబా ఆత్మకథనం వంటి ఈ కథనంలో ఆయన వ్యక్తిత్వ లక్షణాల్ని వివరించి విద్యార్థులకు మార్గదర్శనం చేయాలి.

వచన పాఠాల విశ్లేషణలోనూ, విద్యార్థులు గ్రహించడంలోనూ కీలక పదాల్ని గుర్తించడం చాలా అవసరం. పాఠ్యాంశం ముగిసిన తర్వాత పాఠ్యంలో చర్చించబడిన విషయాల్ని క్రోడీకరించాలి. ప్రశ్నోత్తర పద్ధతి ద్వారా విద్యార్థుల అవగాహనల్ని పరిశీలిస్తూ సరిదిద్దాలి.

మల్లిబాబు, సత్య నాదెండ్ల, సంజీవ్‌దేవ్ వంటి గొప్పవ్యక్తులు గొప్ప విజయాలు ఎలా సాధించారో పరిశీలనగా అర్థం చేసుకుంటే, వారి జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అవుతుంది. లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం లేదా అభిరుచిని పెంపొందించుకొని అందుకనుగుణంగా విరామమెరుగక పరిశ్రమిస్తే వారిలాంటి ఉన్నత స్థానాలకు మనం కూడా చేరుకోవచ్చు అనేది ఉపవాచక పాఠంలో నేర్పవచ్చు. సాహసం, ధైర్యం వంటి లక్షణాలు మస్తాన్‌బాబు ద్వారా-కార్యదక్షత, ధృఢ సంకల్పం, లక్ష్యాన్ని చేరే ప్రయత్నాలు వంటి లక్షణాలు సత్య నాదెండ్ల ద్వారాను- కళాపిపాస, జీవన లాలస, రసమయ జీవన చింతన వంటివి సంజీవదేవ్ ద్వారా నేర్చుకోవచ్చు. విద్యార్థులచే ఉపవాచక పాఠ్యాంశాలు విస్తార పఠనం చేయించాలి.